15 రోజుల్లో.. 7 బోర్లు

ఇందల్వాయి, మార్చి 13: పంటను కాపాడుకునేందుకు గిరిజన రైతు సాహసం చేశాడు. పక్షం రోజుల్లో ఏడు బోర్లు వేయించాడు. కానీ చుక్క నీరు రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం జీకే తండాకు చెందిన రైతు లౌడ్య శ్రీను. ఈయన ఐదెకరాల్లో వరి వేశాడు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉండగా, బోర్లు ఎత్తిపోయాయి. పంటను కాపాడుకోవాలని 15 రోజుల వ్యవధిలో 7 బోర్లు వేయించాడు. ఒక్కదానిలో నుంచి కూడా నీళ్లు రాలేదు. చేసేదేమీ లేక పొలాన్ని పశువులకు వదిలేశాడు. పంట పెట్టుబడితోపాటు బోర్ల కోసం దాదాపు రూ.ఐదారు లక్షలు వెచ్చించాడు. తనలాగే మరికొందరు నష్టపోయారని, తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రైతులను వెంటాడుతున్న కరెంట్ కష్టాలు

యాసంగి సాగుకు నీటి కటకటే కాదు కరెంట్ కష్టాలు తీవ్రమయ్యాయి. ఓవర్‌లోడ్‌తో జగిత్యాల జిల్లా ఎండపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ 83/బీ కెనాల్‌కు దగ్గర, తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్‌తో గురువారం కాలిపోయింది. అక్కడికి ట్రాక్టర్ వచ్చే అవకాశం లేకపోవడంతో పదిమంది ఇలా మోసుకొచ్చారు. అధికారులు స్పందించి ఓవర్ లోడ్ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. -వెల్గటూర్, మార్చి 13

నీళ్లిచ్చి పంటలను కాపాడుతాం

గద్వాల, మార్చి 13: సాగునీటి సరఫరాను మెరుగు పరిచేందుకు చర్యలు చేపడుతామని, పంటలు ఎండిపోకుండా నీళ్లిచ్చి కాపాడుతామని జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్ తెలిపారు. గురువారం ఆయన కేటీ దొడ్డి మండలం కొండాపురం శివారులోని ర్యాలంపాడు ప్రధాన ఎడమ కాల్వ 104 ప్యాకేజీని, ఎండిపోతున్న పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. వెంటనే కాల్వల్లోకి సాగునీటిని విడుదల చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

ఎండినంక నీళ్లిస్తరా?

జనగామ రూరల్, మార్చి 13: జనగామ జిల్లాలోని బొమ్మకూర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు వస్తున్నందున, వాటిని దిగువకు విడుదల చేసి ఎండిపోయిన పంటలకు జీవం పోయాలని రైతులు కోరుతున్నారు. జనగామ మండలంలోని గానుగుపహాడ్, ఎర్రకుంటతండా, మరిగడి, వెంకిర్యాల, వడ్లకొండ తదితర గ్రామాల రైతులు గురువారం గానుగుపహాడ్-వడ్లకొండ క్రాస్ రోడ్డు జనగామ-హుస్నాబాద్ ప్రధాన రహదారిపై పురుగుల మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు.

సీఎం రేవంత్‌రెడ్డి వల్లే సాగు నీటికష్టాలు

జఫర్‌గఢ్, మార్చి13: జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం రఘునాథపల్లిలో ఎండిన వరి, మక్కజొన్న పంటలతోపాటు దేవాదుల కెనాల్ దుస్థితిని మాజీ ఎమ్మెల్యే రాజయ్య గురువారం పరిశీలించారు. పంటలు ఎండిన రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. రైతులతో కలిసి కెనాల్ వద్ద బైఠాయించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ముందుచూపు లేకపోవడంతో రైతులకు సాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయని విమర్శించారు.

రుణమాఫీ ఎందుకు కాలే..?

నాగిరెడ్డిపేట, మార్చి 13: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మద సింగిల్ విండోలో గురువారం నిర్వహించిన మహాజనసభ రసాభాసగా మారింది. సొసైటీ పరిధిలో 108 మందికి సంబంధించి రూ.45 లక్షల రుణమాఫీ కాలేదు. దానిపై ఎందుకు స్పందించరని రైతులు నిలదీశారు. ధాన్యం కొనుగోలులో సైతం తరుగుతో పాటు డ్రైవర్ పేరిట బస్తాకు రూపాయి చొప్పున వసూలు చేయడమేమిటని నిలదీశారు. ఎరువుల స్టాక్ విషయంలో ప్రశ్నించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎండుతున్న పంటలు

జనగామ చౌరస్తా, మార్చి 13: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వరి, మక్కజొన్న పంటలు ఎండుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఎండిపోయిన వరి కంకులతో ధర్నా చేపట్టారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్ మాట్లాడుతూ జిల్లాలోని 8 రిజర్వాయర్లు, 769 చెరువులు, కుంటలకు అవసరమైన సాగునీటిని నింపలేకపోయారని మండిపడ్డారు.

మధురానగర్‌లో రైతు ధర్నా ఉద్రిక్తం

పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నేతలు

మాజీ ఎమ్మెల్యే సుంకె హౌస్ అరెస్ట్

మాజీ ఎమ్మెల్యే సుంకెను బయటకు రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

గంగాధర, మార్చి 13: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయాలని గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి గంగాధర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధురానగర్ చౌరస్తాలో బస్సుల కోసం వేచి చూస్తున్న సాధారణ ప్రజలపై పోలీసులు బెదిరింపులకు దిగారు. 'ఎక్కడికి వెళ్తున్నారు? ఇక్కడ ఏం చేస్తున్నారు?, గుర్తింపు కార్డు చూపించండి' అంటూ భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో వారు నాయకులెవరో, సాధారణ ప్రజలు ఎవరో తెలియదా? అంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బూరుగుపల్లి నుంచి రైతు ధర్నాకు బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

నీటి తిప్పలు తీరేదెట్టా?

యాసంగిలో సాగు నీటి కోసం అష్ట కష్టాలు పడుతున్నా. రెండు ఎకరాల్లో వరి వేసిన. వారం రోజుల నుంచి రెండు బోర్లలో నీళ్లు రావడం లేదు. మా బంధువు బోరు నుంచి పైప్‌లైన్ వేసుకొని పొలానికి నీళంది స్తున్న. వాళ్ల బోరు కూడా వారం, పదిరోజుల్లో ఎండిపోయే పరిస్థితి ఉన్నది. సాగుకు ఇప్పటివరకు రూ.25 వేలు ఖర్చు చేసిన. కొత్తగా బోర్లు వేయాలనుకున్నా దాదాపు 700 ఫీట్లకుపైగా డ్రిల్ చేస్తున్నా నీళ్లు వస్తలే.

– శంకర్‌నాయక్, పోచమ్మతండా, మం: కొడంగల్,

సీఎం రేసులో నేను లేను

- అసెంబ్లీలో కేసీఆర్ తర్వాత నేనే సీనియర్
- చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్
- కొత్త రేషన్‌కార్డులు ఇచ్చాకే సన్న బియ్యం పంపిణీ చేస్తామని వెల్లడి

హైదరాబాద్, మార్చి 13(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై ఇటీవల ఊహాగానాల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పందించారు. గురువారం ఆయన అసెంబ్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో పలు విషయాలు పంచుకున్నారు. సీఎం రేసులో తాను లేనని స్పష్టం చేశారు. 'నేను ఒకే నియోజకవర్గం నుంచి ఏడుసార్లు గెలిచాను. సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తర్వాత నేను సీనియర్ సభ్యుడిని. అయినప్పటికీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష లేదు' అని ఆయన స్పష్టం చేశారు. అయితే మొదటి నుంచి గాంధీ కుటుంబానికి విధేయుడిగా ఉన్న మంత్రి ఉత్తమ్ పేరు పలుమార్లు సీఎం రేసులో ప్రచారంలోకి వచ్చింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌లో సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. గతంలో పీసీసీ చీఫ్‌గా కూడా పనిచేశారు. అసెంబ్లీ ఎన్నికలయ్యాక కూడా ఆయన పేరు కీలకంగా తెరపైకి రాగా, సీఎం పదవి రేవంత్‌రెడ్డిని వరించింది. పార్టీలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో డిసెంబర్‌లో కర్ణాటకతో పాటు తెలంగాణలో కూడా నాయకత్వ మార్పు ఉంటుందని జోరుగా చర్చ జరుగుతున్నది. దీనిని పార్టీ నేతలెవరూ ఖండించడం లేదు. గత కొంతకాలంగా 30సార్లకు పైగా ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డికి అధిష్ఠానం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటన రద్దు కావడం, క్యాబినెట్ విస్తరణ జరగకపోవడం చూస్తుంటే నాయకత్వ మార్పును సూచిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత కూడా అధిష్ఠానానికి ఇబ్బందికరంగా మారిందని, ఈ క్రమంలోనే నాయకత్వాన్ని మార్చాలని భావిస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేసులో ఉత్తమ్ పేరు తెరపైకి వస్తున్నది.

కొత్తకార్డులిచ్చాకే సన్నబియ్యం

రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ మరింత ఆలస్యం కావొచ్చని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమారెడ్డి అభిప్రాయపడ్డారు. కొత్త రేషన్‌కార్డులు ఇచ్చిన తర్వాతే సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఏటీఎం కార్డు తరహాలో కొత్త స్మార్ట్ కార్డులు తయారు చేయిస్తున్నామని, ఇందుకు సంబంధించి టెండర్లు కూడా పిలిచినట్టు తెలిపారు. కొత్త కార్డుల కోసం 18 లక్షల దరఖాస్తులు అందగా, ఇందులో సుమారు 10 లక్షల కార్డులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. బీపీఎల్ కుటుంబాలతో పాటు ఏపీఎల్(దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న) కుటుంబాలకు కూడా కార్డులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. బీపీఎల్ కుటుంబాలకు తెల్లకార్డు, ఏపీఎల్ కుటుంబాలకు నీలం రంగు కార్డు ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం ఇస్తామని ప్రకటించింది. ఆ తర్వాత ఈ గడువును సంక్రాంతికి పొడిగించింది. ఆ తర్వాత ఉగాది నుంచి ఇస్తామని ప్రకటించింది. ఇప్పుడు ఈ గడువుకు కూడా సన్న బియ్యం లేనట్టేనని తేల్చేసింది. ఈసారి కొత్త గడువు కూడా ప్రకటించలేదు.

పాలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి..

విద్యుదాఘాతంతో యువ రైతు దుర్మరణం.. పెద్దపల్లి జిల్లా పెగడపల్లిలో విషాదం

నక్కల రవి(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మార్చి 13: పంటపొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో యువరైతు మృతిచెందిన ఘటన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నక్కల రవి (35) గురువారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి, స్టార్టర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. గొర్రెల కాపరులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. రవికి భార్య అనూష, కూతురు హర్షిణి, కుమారుడు అద్వైత్ ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

పొలం బాట వివాదంతో మనస్తాపం.. గద్వాల జిల్లా మిట్టదొడ్డిలో ఘటన

ఏపీలోని కర్నూల్ దవాఖానలో చికిత్స పొందుతున్న రైతు మారెప్ప

గట్టు, మార్చి 13 : పొలం బాట విషయంలో వివాదం చెలరేగంతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం మిట్టదొడ్డికి చెందిన రైతు మారెప్పకు రెండున్నర ఎకరాల పొలం ఉన్నది. గ్రామంలో ఓ రెండు సర్వే నంబర్ల మధ్య ఉన్న 33 ఫీట్ల రోడ్డుపై చాలాకాలంగా వివాదం నెలకొన్నది. అధికారులు పలుమార్లు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినా వివాదం సద్దుమణగలేదు. గురువారం ఓ సామాజికవర్గం పొలం బాటను ఆక్రమించుకుని సిమెంట్ దిమ్మెలు పాతుతుండడంతో సర్వే నంబర్ 457లోని రైతులు అడ్డుకున్నారు. మనస్తాపానికి గురైన రైతు మారెప్ప అక్కడే గడ్డిమందు తాగాడు. వెంటనే స్థానికులు కర్నూల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

దళిత మంత్రి హవాకు చెక్?

మొదటిపేజీ తరువాయి...

మాధ్యమాల్లోనూ ఇటు ప్రధాన స్రవంతి మీడియాలోనూ పెద్ద చర్చనీయాంశంగా మారింది. అన్నిశాఖల్లో అవినీతి జరుగుతున్నా కేవలం ఒక్క శాఖనే బదనాం చేయడం వెనుక పెద్ద వ్యూహమే దాగి ఉన్నట్టు కాంగ్రెస్ సీనియర్లు చెవులు కొరుక్కుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు సదరు నేత కాంగ్రెస్ పార్టీ తరపున గత అసెంబ్లీలో కీలకనేతగా వ్యవహరించారు. పార్టీ ప్రచారం, అభ్యర్థుల ఎంపిక, గ్యారెంటీల రూపకల్పన తదితర అంశాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించి కాంగ్రెస్‌కు ఊపుతెచ్చే ప్రయత్నం చేశారు. తదనంతర క్రమంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి పదవికి ఆయన ప్రధాన పోటీదారుగా కూడా కనిపించారు. కాంగ్రెస్ అధిష్ఠానం దళిత అనుకూల ఎజెండా తీసుకున్న నేపథ్యంలో ఆయనకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నాయన్న వాదన కూడా వినిపించింది. ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి ఎంపిక కోసం జరిగిన కసరత్తులో కూడా ఆయన ప్రధాన పోటీదారుగా నిలిచారు. అనేక రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకున్న అధిష్ఠానం రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. అదే సమయంలో దళిత వర్గానికి చెందిన ఆ నేతకు సీఎం తర్వాతి స్థానం ఇచ్చి బలమైన మంత్రిత్వశాఖను అప్పగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అసలు కాంగ్రెస్, వలస కాంగ్రెస్‌గా విడిపోయి ఉన్న పరిస్థితుల్లో ఒరిజినల్ కాంగ్రెస్‌కు ఆ నేత ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. ఏనాటికైనా రాష్ట్రంలో ముఖ్యమంత్రిని మార్చాల్సి వస్తే ఆ అవకాశం ఈయనకే ఎక్కువగా ఉంటుందనే రాజకీయ విశ్లేషణలు కూడా అప్పట్లో వినిపించాయి. అటు ప్రభుత్వంలో కూడా ఆయన కీలక పాత్ర పోషిస్తూ వచ్చారు.

ఉచ్చులోకి లాగి..

ముఖ్యమంత్రి ఎప్పుడు ఢిల్లీకి వెళ్లి అధిష్ఠానాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని కలిసినా ఆయన వెంట సదరు నేత కూడా ఉండటం, అన్ని సమావేశాల్లోనూ పాల్గొనడం ఆనవాయితీగా మారింది. దీంతో హైకమాండ్ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యాపించింది. ఆ తర్వాతే పరిణామాలు వేగంగా మారడం మొదలయ్యాయి. ఒకవైపు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటూ రావడం, పరిపాలన సరైన క్రమంలో సాగలేదన్న అభిప్రాయం ప్రబలుతుండటంతో ఏనాటికైనా సదరు దళిత నేతతో తనకు ప్రమాదం తప్పదనే అంచనాకు వచ్చిన ముఖ్యనేత వర్గం, ఆయనను టార్గెట్ చేసుకొని వేగంగా పావులు కదిపిందని కాంగ్రెస్‌లోని ఉన్నత స్థాయి వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన పరపతిని, పలుకుబడిని తగ్గించి పలుచన చేసేందుకు పక్కా ప్లాన్ ప్రకారం ఉచ్చులోకి లాగారని , సదరు దళిత నేతతో సన్నిహితంగా మెలిగే కాంగ్రెస్ నాయకుడు ఒకరు పేర్కొన్నారు. ప్రభుత్వంలో తనకు పోటీగా మారే అవకాశం ఉన్న ముగ్గురు మంత్రులపై ముఖ్యనేత నిఘా పెంచారని మిగతా నేతల సన్నిహితులు పేర్కొన్నారు. 'మంత్రుల వద్దకు వివిధ పనులపై పథకం ప్రకారం కొంతమంది రావటం, డబ్బులు చేతులు మారటంపై పక్కా ఆధారాలతో నివేదికలు అధిష్ఠానానికి పంపించారు. ఇదంతా ఒక పద్ధతి ప్రకారం.. వ్యూహాత్మకంగా ఎవరికీ అనుమానం లేకుండా జరిగింది. ఢిల్లీకి నిధులు కావాలంటూ ముఖ్యనేత వర్గం వేసిన ఎత్తుగడలో ముగ్గురు మంత్రులు ఇరుక్కుపోయారు' అని పార్టీ సీనియర్ నేత ఒకరు వివరించారు.

సెక్రటేరియట్‌లో ధర్నా ఎలా జరిగింది?

ఆ తర్వాతే అసలు కథ మొదలైంది. ముగ్గురు మంత్రుల్లో ఎక్కువ ప్రమాదకరంగా భావిస్తున్న దళిత నేతను సదరు వర్గం టార్గెట్‌గా చేసుకున్నది. ఆయన శాఖలో కమీషన్ల పర్వం నడుస్తున్నదంటూ లీకులు వదిలింది. అటు సోషల్ మీడియాలోనూ ఆయనను బలహీనపరిచే పనులు మొదలుపెట్టింది. పైనుంచి కిందిదాకా ఈ విషయం ప్రచారమయ్యేలా చేసింది. ఈ క్రమంలోనే ఇటీవల ఆర్థికశాఖ చాంబర్ ముందు దాదాపు 200 మందికిపైగా కాంట్రాక్టర్లు నిరసన తెలిపారు. 20 శాతం కమీషన్ అడుగుతున్నారంటూ ముందు విలేకరుల సమావేశం పెట్టి మరీ సచివాలయానికి వచ్చి రగడ సృష్టించారు. ఇది తీవ్ర చర్చనీయాంశమైంది. 'ఇదంతా చూస్తుంటే ఢిల్లీకి డబ్బు వసూళ్లంటూ వ్యవహారాన్ని దళిత మంత్రికి అంటగట్టారు. పథకం ప్రకారం లంచం కాంట్రాక్టర్లతో ధర్నా చేయించారు'అని ఓ దళిత సంఘం నేత ఆరోపించారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా ప్రధాన సమాచార సాధనాల్లో రావడంతో అధిష్ఠానం నివ్వెరపోయింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్వయంగా దీనిపై ఆరా తీసి నివేదిక తెప్పించుకున్నారు. గుట్టుగా గుంభనంగా చేయాల్సిన వ్యవహారాలను ఇలా ఎలా రోడ్డుకెక్కిస్తారని, ఈ వ్యవహారంతో ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేసినట్టు మరోసారి బయటకు లీకులు వచ్చాయి. 'అసలు గుట్టంతా ఇందులోనే ఉన్నది. సచివాలయానికి ఐదంచెల భద్రతా వ్యవస్థ ఉన్నది. అందునా ఆ మంత్రి చాంబర్ ఉన్న ఫ్లోర్‌కు అదనపు భద్రత కూడా ఉన్నది. అలాంటప్పుడు ఇంత పటిష్ట భద్రత ఉన్న మంత్రి చాంబర్ వద్దకు ఏకంగా 200 మంది కాంట్రాక్టర్లు ఎలా వెళ్లగలిగింద్రు? అదికూడా ఒకవైపు బిల్లులపై గొడవ జరుగుతున్న సమయంలో! కాంట్రాక్టర్లు విలేకరులు సమావేశం నిర్వహించి మరీ సచివాలయానికి వెళ్లగలిగితే ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తున్నది? ఇదంతా అనుమానాస్పదంగా కనిపించడం లేదా? కొంచెం పొలిటికల్ బ్రెయిన్ ఉన్న ఎవరైనా దీని వెనుక ఏం జరిగిందో సులువుగా అర్థమవుతుంది' అని ఒక అసలు కాంగ్రెస్ ముఖ్యుడు ఒకరు విశ్లేషించారు. సచివాలయం అనేది నిషిద్ధ ప్రాంతమని, అందులోకి వెళ్లి ధర్నాలు చేయడం చట్ట వ్యతిరేకమని, అయినా ధర్నా నిర్వహించిన కాంట్రాక్టర్లపై ఎలాంటి కేసులూ ఎందుకు నమోదు కాలేదని ఆయన ప్రశ్నించారు. చిన్నచిన్న విషయాలపై పెద్ద సెక్షన్లు పెట్టి జర్నలిస్టులను సైతం జైలుకు పంపుతున్న పోలీసులు, ప్రభుత్వ ప్రతిష్టకు ఇంత మచ్చ తెచ్చిన అంశం మీద ఎందుకు స్పందించలేదని ఆయన అనుమానం వ్యక్తంచేశారు. దీని వెనుక ఎవరున్నారనేది అర్థమవుతుందని పేర్కొన్నారు.

పార్టీని బతికించినందుకు బహుమతి?

కాంట్రాక్టర్ల మెరుపు ధర్నాపై అనుమానాలు ఇలా కొనసాగుతుండగానే ఢిల్లీలో కీలక పరిణామాలు చకచకా జరిగిపోయాయి. ఎప్పుడూ ముఖ్యమంత్రి వెంట ఢిల్లీకి వెళ్లే దళిత మంత్రికి బదులు ఆ అవకాశం శ్రీధర్‌బాబుకు, తర్వాత ఉత్తమ్‌కు దక్కింది. మరోవైపు ముఖ్యనేత వర్గం తన శిబిరానికే చెందిన ఒక సన్నిహిత మంత్రి, మరికొందరు ఎమ్మెల్యేల ద్వారా దళిత మంత్రిపై హైకమాండ్‌కు ఫిర్యాదు చేశారంటూ ఢిల్లీలోని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ మంత్రి వ్యవహారాల వల్ల, రాష్ట్రంలో పార్టీ ప్రతిష్టకు, ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలుగుతున్నదని, అధిష్ఠానం జోక్యం చేసుకొని వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేసినట్టు సమాచారం బయటకు పొక్కింది. మరోవైపు దళిత మంత్రి క్యాబినెట్ నుంచి తప్పించబోతున్నారంటూ తెలంగాణ మీడియా, కాంగ్రెస్ రాజకీయ వర్గాల్లో ప్రచారం మొదలైంది. 'ఇదంతా స్టాటజీ ప్రకారం జరుగుతున్నది. ప్రభుత్వంలో అవినీతి లేనిదెక్కడ? పైనుంచి కింది దాకా అందరిపైనా అవినీతి ఆరోపణలు, సెటిల్‌మెంట్ల విమర్శలు ఉన్నాయి. అయినా ఒక్కరినే టార్గెట్ చేయడం వెనుక ఆయనకు చెక్ పెట్టే కుట్ర దాగి ఉన్నట్టు కనిపిస్తున్నది. క్యాబినెట్‌లో ఉన్నత స్థానంలో ఉండటం కొందరికి నచ్చుతున్నట్టు లేదు..ఓర్చుకోలేకపోతున్నారు. మొదటి నుంచీ అధిష్ఠానం పెద్దలకు సన్నిహితంగా ఉండడం, ఎప్పుడంటే అప్పుడు ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం కొందరు ఓర్వలేకపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బతికించిన ఒక దళిత నాయకుడి ప్రాధాన్యాన్ని తగ్గించే కుట్రలు పన్నుతున్నారు'అని ఆయనకు సన్నిహితంగా ఉండే ముఖ్య నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత మంత్రి వర్గ విస్తరణ జరుగుతుందని, దాంట్లో తమ నేత శాఖను మారుస్తారనే ప్రచారం వెనుక పెద్ద కుట్రనే దాగి ఉన్నదని ఓ దళిత నేత సందేహం వ్యక్తంచేశారు. పార్టీలో ప్రస్తుతం ఎవరినీ నమ్మే పరిస్థితి లేదని, ఈ కోవర్టు రాజకీయంలో తమ నాయకుడు నష్టపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వెలిబుచ్చారు.